ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 92 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 12 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## డేంజర్ జోన్‌లో సునీత విలియమ్స్

### అంతరిక్షంలోనే మరో మూడు నెలలు: నాసా

న్యూఢిల్లీ, జులై 11 (ప్రభాత ఉదయం): భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ డేంజర్ జోన్లో చిక్కుకున్నారు. కొలిగ్ బారీ బుచ్ విల్మోర్‌తో కలిసి బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమ నౌకలో జూన్ 5న అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన విలియమ్స్.. ఐఎస్ఎస్‌తో అనుసంధానమయ్యే క్రమంలో హీలియం లీకేజీ కారణంగా వ్యోమ నౌకలో పలు లోపాలు తలెత్తాయి. ఉత్కంఠ నడుమ ఎట్టకేలకు జూన్ 6న స్టార్‌లైనర్ సురక్షితంగా ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. వారి యాత్ర సజావుగా సాగకపోవడంతో ఆమె తిరుగు ప్రయాణం మరింత ఆలస్యం అయింది. దాంతో ..మిగతా 2లో

# ఆదాయంపై ఫోకస్ పెట్టండి

## రాబడులపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి



హైదరాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం): రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే విభాగాలన్నీ నిర్ణీత వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విభాగం నెలవారీగా లక్ష్యాలను తయారు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు సాధించిన పురోగతిని బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆదాయం తెచ్చి పెట్టే వనరులపై, పన్నుల వసూళ్లపైన అధికారులు నిక్కచ్చిగా ఉండాలని ఆదేశించారు. సంబంధిత విభాగాన్ని అవసరమైతే పునరవ్యవస్థీకరించుకోవాలని, ఆదాయం రాబట్టేందుకు వీలైనన్ని సంస్కరణలు చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, రవాణా విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సచివాలయంలో దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా ఈ సమావేశంలో వివిధ అంశాలను చర్చించారు. ఎంచుకున్న వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా ..మిగతా 2లో



## 23న పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్

### బడ్జెట్‌పై ప్రధాని మోదీ సమీక్ష

#### ఆర్థికవేత్తలు, నిపుణులతో భేటీ

న్యూఢిల్లీ, జులై 11 (ప్రభాత ఉదయం): కేంద్ర బడ్జెట్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో మోదీ భేటీ అయ్యారు. ఈ సమావేశానికి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హాజరయ్యారు. ఈ నెల 23న కేంద్రం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ సాధారణ బడ్జెట్‌లో పరిశ్రమలతో పాటు మధ్య తరగతి, దిగువ తరగతి ప్రజలపై భారీ ఆశలు పెట్టుకున్నారు. పెట్టుబడులను రాబట్టేందుకు కేంద్రం ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయాలని భావిస్తోంది. గత పార్లమెంట్ సమావేశాల సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మోదీ 3.0 ప్రభుత్వం సంస్కరణలను వేగవంతం చేయనుందని చెప్పారు. పెట్టుబడులు రాబట్టడం ద్వారా వృద్ధిరేటు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం వ్యూహం సిద్ధం చేస్తోంది. ఏ రంగంలో ఏ స్థాయిలో సంస్కరణలు అవసరమో ఆయా రంగాల నిపుణుల నుంచి అభిప్రాయాలను సేకరించాలని ప్రధాని మోదీ నిర్ణయించారు. 2047 నాటికి మోదీ సర్కార్ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. సాధారణ బడ్జెట్ ద్వారా అభివృద్ధి చెందిన భారతదేశానికి ప్రభుత్వం రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని, ఇందుకోసం ప్రత్యేకంగా మౌలిక సదుపాయాల రంగంలో ప్రత్యేక కృషి అవసరమని భావించారు. ఆర్థికవేత్తలతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు సైతం పేద, మధ్య దిగువ మధ్యతరగతి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదాయపు పన్ను, గృహ రుణాల విషయంలో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలకు ఊరట కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. పేదల కోసం కొత్త పథకాన్ని ప్రారంభించే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు సమాచారం.

## రక్షణశాఖ మంత్రికి అస్వస్థత

### ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిన రాజ్ నాథ్ సింగ్



న్యూఢిల్లీ, జులై 11 (ప్రభాత ఉదయం): ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) న్యూరో సర్జరీ విభాగంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేరారు. ఆయన వెన్ను నొప్పితో బాధపడు తున్నట్లు సమాచారం. న్యూరో సర్జన్ డాక్టర్ అమోల్ రహేజా పర్యవేక్షణలో ఆయనకు చికిత్స జరుగుతోంది.

## నీట్‌పై విచారణ.. జులై 18కి వాయిదా




## తెలంగాణకు మరో అమెరికా దిగ్గజం

### భారీ పెట్టుబడికి సిద్ధమైన 'మైక్రోలింగ్ నెట్‌వర్క్స్'



హైదరాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం): తెలంగాణకు భారీ పరిశ్రమలు వస్తూనే ఉన్నాయి. ఇప్పటికే పలు దిగ్గజ కంపెనీలు.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టగా.. ఇప్పుడు.. అమెరికా టెలికమ్యూనికేషన్స్ దిగ్గజం మైక్రోలింక్ నెట్ వర్క్స్ కూడా తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిస్తోంది. రూ.500 కోట్ల పెట్టుబడితో తెలంగాణలో ఎలక్ట్రానిక్, ఇతర ఉత్పత్తుల కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు మైక్రోలింగ్ నెట్‌వర్క్స్ ముందుకొచ్చినట్టుగా.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో మైక్రోలింక్ పరిశ్రమల క్లస్టర్‌ను ప్రారంభిస్తుందని చెప్పుకొచ్చారు. గురువారం (జులై 11న) రోజున సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో మైక్రోలింక్ గ్లోబల్ ప్రతినిధులతో పాటు.. భారతీయ భాగస్వామి పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ రంగారావు సమావేశమయ్యారు. వచ్చే మూడేళ్లలో రూ.500 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రానిక్, ఐటీ, నిర్మాణరంగ పరికరాలను మైక్రోలింగ్ నెట్‌వర్క్ ఉత్పత్తి చేస్తుందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ క్లస్టర్ ఏర్పాటు వల్ల 700 మందికి ఉపాధి లభించే అవకాశాలున్నాయని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో.. మైక్రోలింక్ నెట్ వర్క్స్ యాజమాన్యంతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని ..మిగతా 2లో

## తెలంగాణ వ్యాప్తంగా నిలిచిన రిజిస్ట్రేషన్లు



హైదరాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం): తెలంగాణ వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా ఆగినట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు తెలిపారు. సాంకేతిక సమస్య కారణంగా గురువారం మధ్యాహ్నం నుంచి అంతరాయం ఏర్పడిందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్‌కు ఆధార్ లింక్ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తినట్టు చెప్పారు. యూడీఐఏలో ఈకేవైసీ వెరిఫికేషన్‌కు సంబంధించి సాంకేతిక సమస్యగా చెబుతున్న అధికారులు దానిని పరిష్కరించేందుకు సాంకేతిక నిపుణుల ద్వారా ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు సాంకేతిక సమస్య కారణంగా ఇబ్బంది పడ్డారు. సమస్య పరిష్కారమైతే వేచి ఉన్న వారి రిజిస్ట్రేషన్లు వెంటనే పూర్తి ..మిగతా 2లో

## బీఆర్ఎస్‌కు మరో షాక్

### కాంగ్రెస్‌లోకి ఇంకో ఎమ్మెల్యే.. ఎనిమిదికి చేరిన సంఖ్య

#### కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



హైదరాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం): తెలంగాణలో రాజకీయ పరిణామాలు రోజు రోజుకు మరింత ఆసక్తికరంగా మారుతున్నాయి. రేవంత్ రెడ్డి మొదలుపెట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా.. ఇప్పటికే ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పుకోగా.. ఇప్పుడు మరో ఎమ్మెల్యే షాక్ ఇచ్చారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కూడా.. కాంగ్రెస్ గూటికి చేరుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే.. ..మిగతా 2లో



## జీవో 317పై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం

హైదరాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం): రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన జీవో 317పై కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ కమిటీ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు, శివశంకర్ (రిటైర్డ్ ఐఏఎస్), జీఏడి అధికారులు పాల్గొన్నారు . ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను సబ్ కమిటీ ..మిగతా 2లో

# ఆదాయంపై ఫోకస్ పెట్టండి

మొదటి పేజీ తరువాయి...

లేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకా నెలా మంత్లీ టార్గెట్ ను నిర్దేశించుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై తాను సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. నెలవారీ సమీక్షతో పాటు ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశమవుతారని చెప్పారు. ప్రధానంగా రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే జీఎస్టీ ఆదాయం పెంచుకునే చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. జీఎస్టీ రాబడి పెంచేందుకు వాణిజ్య పన్నుల శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, పక్కాగా ఆడిటింగ్ చేయాలని సీఎం ఆదేశించారు. జీఎస్టీ చెల్లింపుల విషయంలో ఎవరినీ ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. పెట్రోలు, డీజిల్ పై వాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, ప్రత్యామ్నాయంగా ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను సూచించారు. ఎన్నికలప్పుడు మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినప్పటికీ అంతమేరకు ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సీఎం ఆరా తీశారు. అక్రమ



మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశముందని చర్చ జరిగింది. డిస్టిలరీస్ నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, అందుకు అవసరమైన అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సీఎం ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో హైదరాబాద్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని సమావేశంలో చర్చ జరిగింది. ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో అటు కమర్షియల్ నిర్మాణాలు పెరిగాయని, గృహ నిర్మాణాలు కూడా అదే వరుసలో పుంజుకుంటాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగించేందుకు పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమలైందని, తిరిగి పన్ను వసూలు చేయటం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏమైనా ప్రభావం పడిందా.. అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.



## తెలంగాణ వ్యాప్తంగా నిలిచిన రిజిస్ట్రేషన్లు

మొదటి పేజీ తరువాయి...

చేస్తామని, రద్దీగా ఉన్న కార్యాలయాల్లో శుక్రవారం రావాల్సిందిగా ఇప్పటికే తెలియజేసినట్టు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడంపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్ వివరణ ఇచ్చారు. "దిల్లీలో కురుస్తున్న వర్షాల కారణంగా యూడీఐఏలో సాంకేతిక సమస్య తలెత్తింది. ప్రతి రోజు దాదాపు 7వేల రిజిస్ట్రేషన్లు జరిగేవి. ఆధార్ సర్వర్లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా ఆశించిన మేర జరగలేదు. ఈ రాత్రికి సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. పెండింగ్ రిజిస్ట్రేషన్లను రేపటికి రీషెడ్యూల్ చేశాం" అని తెలిపారు.

## తెలంగాణకు మరో అమెరికా దిగ్గజం

మొదటి పేజీ తరువాయి...

మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. అనంతరం.. తెలంగాణలో పెట్టుబడులకు అంగీకరించిందని మంత్రి తెలిపారు. డేటా ట్రాన్స్మిషన్, నెట్వర్కింగ్ కేబుల్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మల్టీ లెవెల్ పార్కింగ్ మిషన్ల ఉత్పత్తిలో మైక్రోలింక్ నెట్ వర్క్స్ గ్లోబల్ లీడర్గా ఉంది. ఇప్పుడా కంపెనీ పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో పరిశ్రమలను ఏర్పాటు చేస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణలో నైపుణ్యం ఉన్న సిబ్బందికి కొరత లేదని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇలాంటి దిగ్గజ కంపెనీలు రావటం వల్ల వాళ్లందరికీ మంచి అవకాశాలు దొరుకుతాయని చెప్పుకొచ్చారు. కాగా.. మైక్రోలింక్ నెట్వర్క్స్ సమావేశంలో.. పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ రంగారావు, డైరెక్టర్ నమ్రత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధర్మరాజు చక్రవరం, మైక్రోటెక్ గ్లోబల్ ప్రతినిధులు డెనిస్ మొటావా,సియాన్ ఫిలిప్స్, జో జోగ్స్, అశోక్ పెర్సోత్తమ్తో పాటు తదితరులు పాల్గొన్నారు.




## సహకార ఆర్థిక సంస్థ చైర్మన్గా నియమితులైన నూతి శ్రీకాంత్ గౌడ్ని మర్యాదపూర్వకంగా కలిసిన జిట్టా సునీల్ యాదవ్

కూకట్పల్లి, జూలై 11 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ గా పదవి ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతి శ్రీకాంత్ గౌడ్ ని, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు జిట్టా సునీల్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు భరోసా అభిప్రాయ సేకరణ నేడు



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూలై 11(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నేడు వనపర్తి జిల్లా కు చెందిన రైతు భరోసా పై అభిప్రాయ సేకరణకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు రానున్నారని అభిప్రాయ సేకరణకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు రైతుల నుండి అభిప్రాయ సేకరణ జరుపుతారని జిల్లా కాంగ్రెస్ కిషన్ విభాగం అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు మధ్యాహ్నం ఒకటిన్నర వరకు కమిటీ సభ్యులు రైతు భరోసా కార్యక్రమం ఉంటుందని తెలియజేస్తున్నాను. ఉమ్మడి జిల్లాలో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తూ రైతుల నుండి వచ్చే సూచనలు స్వీకరిస్తూ ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలియజేస్తున్నాను. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు, రాష్ట్ర క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, వైద ఆరోగ్య శాఖ మంత్రి ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పార్లమెంటు సభ్యులు మల్లు రవి, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐదు జిల్లాల కలెక్టర్లు వ్యవసాయ శాఖ ఉన్నంత అధికారులు తదితరులు హాజరవుతున్నారు ఈ సమావేశంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన రైతులు, రైతు నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలపారు.

## డేంజర్ జోన్లో సునీత విలియమ్స్

మొదటి పేజీ తరువాయి...

ఆమె ఆరోగ్యంపై అనుమానాలు తలెత్తున్నాయి. ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నట్లు చెప్పారు విలియమ్స్. త్వరలోనే స్పేస్ నుంచి సేఫ్గా తిరిగి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. మరో పక్క స్టార్లైనర్ వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మరిన్ని నెలలు ఉండనుందని నాసా వెల్లడించింది. అంతరిక్ష కేంద్రంలో పరీక్షలు పూర్తయ్యే వరకు భూమిపైకి తిరిగి వచ్చే తేదీని నిర్ణయంచలేమని నాసా కమర్షియల్ ప్రోగ్రామ్ మేనేజర్ స్టీవ్ స్టిచ్ పేర్కొన్నారు. వ్యోమగాములు ఇద్దరూ సురక్షితంగా ఉన్నారని వెల్లడించారు. స్టార్లైనర్ మిషన్ వ్యవధిని 45-90 రోజులకు పొడిగించాలనుకుంటున్నట్లు తెలిపారు.

## జీవో 317పై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం

మొదటి పేజీ తరువాయి...

ప్రకటించింది. కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో స్పౌజ్, మెడికల్, మ్యూచువల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భార్య/భర్త చేసుకున్న దరఖాస్తులపై కమిటీ సానుకూలంగా నిర్ణయం తీసుకుంది . కేబినెట్ సబ్ కమిటీకి చేసుకున్న దరఖాస్తులను సంబంధిత శాఖాధిపతులకు పంపించాల్సిందిగా జీఏడి అధికారులకు కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. మిగతా దరఖాస్తులను వివిధ శాఖలకు పంపి వాటిని పరిశీలన చేసిన అనంతరం తిరిగి కేబినెట్ సబ్ కమిటీ దృష్టికి తీసుకురావాలని కమిటీ సమావేశంలో నిర్ణయించింది.



## యూట్యూబర్ ప్రణీత్కు 14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం): మంచీచెడుల విచక్షణ మరచి తండ్రి, కూతురు బంధానికి అశ్లీలం జోడించి మాట్లాడిన బూతు యూట్యూబర్ ప్రణీత్ హనుమంతుకు హైదరాబాద్ నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించింది. ప్రణీత్పై 67బీ ఐటీ యాక్ట్, ఫోక్సో యాక్ట్ ,79, 294 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి బెంగళూరులో అరెస్టు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు గురువారం నాంపల్లి కోర్టులో హాజరు పర్చారు. ప్రణీత్కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఇదే కేసులో ఏ2గా డల్లాస్ నాగేశ్వరరావు, ఏ3గా బుర్రా యువరాజ్, ఏ4గా సాయి ఆదినారాయణను చేర్చారు.



## లావణ్య, రాజ్ తరుణ్ కేసులో బిగ్ ట్విస్ట్

హైదరాబాద్ జులై 11 (ప్రభాత ఉదయం): లావణ్య, హీరో రాజ్ తరుణ్ కేసులో ట్విస్ట్ల మీద ట్విస్ట్లు చోటు చేసుకుంటున్నాయి. తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని రాజ్తరుణ్పై లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా.. లావణ్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని రాజ్ ఇటీవల చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ కేసుకు సంబంధించి హీరో రాజ్తరుణ్కు బిగ్ షాక్ తగిలింది. నార్సింగ్ పోలీస్స్టేషన్లో హీరోతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు అయ్యింది. ఏ 1 గా రాజ్ తరుణ్, ఏ2 గా మాల్వి మల్హోత్రా, ఏ3గా మయాంక్ మల్హోత్రాన్ని చేర్చుతూ నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేశారు.




## నీట్పై విచారణ.. జులై 18కి వాయిదా

న్యూఢిల్లీ, జులై 11 (ప్రభాత ఉదయం): దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన నీట్-యూజీ (2024) పరీక్షల అక్రమ వ్యవహారంపై మరోసారి విచారణ చేపట్టిన భారత సర్వోన్నత న్యాయస్థానం తదుపరి విచారణను జులై 18కి వాయిదా వేసింది. తొలుత దీనిపై శుక్రవారమే విచారణ చేపడతామని చెప్పినప్పటికీ.. సొలిసిటర్ జనరల్ అభ్యర్థన మేరకు వాయిదాను పొడిగించింది. 'జులై 8న ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈ వ్యవహారంపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తమ స్పందనలు తెలియజేశాయి. ఆ అఫిడవిట్లు అందరు పిటిషన్దారులకు ఇంకా చేరలేదు. వాటిని పరిశీలించేం దుకు వీలుగా సమయమిస్తూ తదుపరి విచారణ జులై 18కి వాయిదా వేస్తున్నాం' అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు.

లీకైన ఆ నీట్ ప్రశ్నపత్రం బిహార్లోని ఒక్క పరీక్ష కేంద్రానికే పరిమితమైందని, విస్తృతంగా వ్యాప్తి చెందలేదని కేంద్ర దర్యాప్తు సంస్థ సుప్రీంకోర్టుకు తెలియజేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అంతేకాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ ఇది వ్యాప్తి చెందలేదని పేర్కొన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన నివేదికను న్యాయస్థానానికి సీల్డ్ కవర్లో గురువారం అందజేసింది.

నీట్ ప్రశ్నపత్రం లీకైనమాట వాస్తవమని తేలడంతో ఇందులో అవకతవకలు జరిగాయనడంలో ఎటువంటి సందేహం లేదని సుప్రీంకోర్టు ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, ఇది 23 లక్షల మంది విద్యార్థుల భవితవ్యంతో ముడిపడి ఉన్నందున 'మళ్లీ పరీక్ష' నిర్వహణపై నిర్ణయం తీసుకునేముందు దీని విస్తృతి ఏమేరకు ఉందనే విషయం తెలుసుకోవాలని అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే ఎన్టీఏ, కేంద్రంతోపాటు సీబీఐ నుంచి నివేదికలు కోరింది.

# బీఆర్ఎస్కు మరో షాక్

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ నాయకత్వంతో చర్చలు పూర్తయ్యాయని.. కండువా కప్పుకోవటమే తరువాయిగా మారిందని తెలుస్తోంది. రేపు (జులై 12న) సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్టు సమాచారం. ప్రకాష్ గౌడ్తో పాటు మరో ఇద్దరు మున్సిపల్ ఛైర్మన్లు కూడా కాంగ్రెస్ గూటికి చేరుకోనున్నారు. గత మూడు నెలల క్రితమే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కూడా కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారన్న వార్తలు చక్కర్లు కొట్టాయి. కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వంతో చర్చలు కూడా పూర్తయ్యాయని ఇక.. కండువా కప్పుకోవటమే తరువాయి అన్న సందర్భంలో.. బీఆర్ఎస్ పెద్దలు రంగంలోకి దిగారు. ప్రకాష్ గౌడ్తో మంతనాలు జరిపారు. బీఆర్ఎస్ పార్టీని వీడొద్దంటూ బుజ్జగింపులు జరిపారు. దీంతో.. ప్రకాష్ గౌడ్ మనుసు మార్చుకోవటంతో చేరికకు అప్పుడు బ్రేక్ పడింది. కట్ చేస్తే.. ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ నాయకత్వానికి షాక్ ఇస్తూ.. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు.

మొత్తానికి.. నాటకీయ పరిణమాల మధ్య ప్రకాష్ గౌడ్ చేరికపై క్లారిటీ వచ్చింది. ఇదిలా ఉంటే.. ఇప్పటికే ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్లో చేరిన విషయం తెలిసిందే. సిట్టింగ్ ఎమ్మెల్యేలైన.. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి.. బీఆర్ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీళ్లతో పాటు ఒకేసారి ఆరుగురు ఎమ్మెల్సీలు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని బిగ్ షాక్ ఇచ్చారు. కాగా.. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధిష్ఠానం కూడా సీరియస్గా ఉంది. ఇప్పటికే.. కీలక నేతలతో ఢిల్లీకి వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు పడేలా చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. అటు.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించగా.. ఆ పిటిషన్ పై గురువారం ( జూలై 11) విచారణ చేపట్టింది. ఇరు వర్గాల వాదనలు విన్న హైకోర్టు .. తదుపరి విచారణను సోమవారానికి (జూలై 15)వాయిదా



వేసింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచి.. కాంగ్రెస్లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. కోర్టు స్పందించి ఆ ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకునేలా చేయాలని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు వాదిస్తున్నారు.

# భక్తులు స్వామివారి రథాన్ని లాగి మోక్షం పొందాలి



అత్తాపూర్ లోని ఇస్కాన్ టెంపుల్



వివరాలు వెల్లడిస్తున్న సచితానందన్ హరిదాస్, మధుర కన్నయ్య దాస్‌లు

## ఈ నెల 13న 10 వేల మంది భక్తులతో వైభవంగా జగన్నాథ రథయాత్ర.. ఇస్కాన్ టెంపుల్ అత్తాపూర్ మేనేజర్ సచితా నందన్ దాస్

రాజేంద్రనగర్,జులై 11(ప్రభాత ఉదయం): అత్తాపూర్ ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో శ్రీ పూరి జగన్నాథ్ రథయాత్రను ఈనెల 13 శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇస్కాన్ టెంపుల్ అత్తాపూర్ మేనేజర్ సచిదా నందన్ దాస్ తెలిపారు.గురువారం ఇస్కాన్ టెంపుల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగన్నాథ్ రథయాత్ర రూట్ మ్యాప్ ను వెల్లడించారు. ఈ సందర్భంగా సచిదా నందన్ దాస్ మాట్లాడుతూ...ఈనెల 13వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పూరి జగన్నాథ్ రథయాత్ర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. భగవంతుడు బయటికి రథయాత్రతో వచ్చి తన దర్శనాన్ని భక్తులకు అందిస్తాడని వెల్లడించారు.భక్తులు స్వామివారి రథాన్ని లాగి మోక్షం పొందాలన్నారు.రథయాత్ర అత్తాపూర్ లో ప్రారంభమై ఉప్పర్ పల్లి ఎస్ బిఆర్ గార్డెన్ లో ముగుస్తుందన్నారు.పల్లకీసేవ,ప్రత్యేక పూజలు, భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.దిగ్విజయంగా నిర్వహిస్తున్న జగన్నాథుడు,సుభద్ర,బలరాముల విగ్రహాలతో మూడవ రథయాత్ర కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.సుమారు 10 వేల మంది భక్తుల మధ్య వైభవంగా రథయాత్ర నిర్వహించేందుకు ఇస్కాన్ సంస్థ వారు ఏర్పాట్లు చేస్తున్నారు. యాత్రకు ఇస్కాన్ టెంపుల్ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని,యాత్రకి వచ్చే వారందరికీ తీర్థప్రసాదాలు ఉంటాయని భక్తులు ఇందులో విశేషంగా పాల్గొనాలని కోరుతున్నారు.రథయాత్ర ఉత్సవానికి అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.రథయాత్రలో ఇస్కాన్ టెంపుల్ సీనియర్ స్వామీజీలు సీత రామ్ దాస్,వేదాంత చైతన్య దాస్, రాధేశ్యం దాస్,వరద కృష్ణ దాస్,చైతన్య అవతార్ దాస్ పాల్గొంటారని తెలిపారు.ఈ సమావేశంలో టెంపుల్ కమాండర్ మధుర కన్నయ్య దాస్ పాల్గొన్నారు.



తూర్పు నిర్మల జగ్గారెడ్డి ని కలసి శుభాకాంక్షలు తెలిపి సన్మానిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సానెం శ్రీనివాస్ గౌడ్

## తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణస్వీకారానికి కాంగ్రెస్ నాయకుడు సానెం శ్రీనివాస్ గౌడ్

రాజేంద్రనగర్,జులై 11(ప్రభాత ఉదయం): తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ గా తూర్పు నిర్మల జగ్గారెడ్డి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సానెం శ్రీనివాస్ గౌడ్ వెళ్లారు. ఆమెను సానెం శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.ప్రత్యేకంగా అభినందించారు.నిర్మల రెడ్డికి కార్పొరేషన్ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు సానెం శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.నిర్మలరెడ్డికి కార్పొరేషన్ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

# న్యాయవాదులపై పోలీసుల దాడి బాధాకరం

## రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకట్ రెడ్డి

రాజేంద్రనగర్,జులై 11(ప్రభాత ఉదయం): సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై సద్ధిపేట పోలీసుల దౌర్జన్యాన్ని రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకట్ రెడ్డి ఖండించారు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ పిలుపు మేరకు రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ...సిద్దిపేట న్యాయవాది పై పోలీసుల దాడి అమానవీయం,చట్ట వ్యతిరేకమన్నారు.తన విధి నిర్వాహణలో భాగంగా వేరొక కేసులో నిందితుడు అయిన తన క్లయింట్ కు ముందస్తు బెయిల్ కు సంబందించిన పని కోసం వెళ్లిన న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు.ఈ దాడిని ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు.భాధిత న్యాయ వాదికి న్యాయం జరగాలన్నారు.తప్పు చేసిన పోలీస్ వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదులు రక్షణ చట్టన్ని వెంటనే అమలు చేయాలన్నారు. న్యాయవాదులపై కక్షపూరితంగా దాడులు చేయడం పోలీసులకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికే ఎన్నోసార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకురావాలని విన్నవించినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు.అంతేకాకుండా ఒక న్యాయవాది తన విధులు నిర్వహించే క్రమంలో ఎవరిపై ఎలాంటి వ్యక్తిగత కక్షతో కేసులు వాదించడం జరుగదని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి టీఎల్ శ్రీధర్‌రెడ్డి, ప్రతాప్‌గౌడ్,కృష్ణ, నాయక్, వెంకటేశం,రాజేందర్, పెంటారెడ్డి,భూపాల్, అయ్యప్పరెడ్డి, పూర్ణ చందర్ రెడ్డి, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.



పూజలలో పాల్గొన్న భక్తులు

# బుద్వేల్ శ్రీ కట్ట మైసమ్మ దేవాలయంలో వారాహి దేవీ నవరాత్రి మహోత్సవాలు

బుద్వేల్, జూలై11(ప్రభాత ఉదయం): బుద్వేల్ శ్రీ కట్ట మైసమ్మ దేవాలయంలో వారాహి దేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని ప్రతిరోజు ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం దేవాలయ ఆవరణలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రతిరోజు దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.



బుద్వేల్ శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారు



# హుండీ ఎత్తుకెళ్లిన దొంగలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(ప్రభాత ఉదయం)జిల్లా కేంద్రంలోని బీరొల్లు రోడ్డులో గల శ్రీ తాయమ్మ అవ్వ ఆలయంలో గురువారం దొంగలు పడ్డారు. గుడిలో ప్రవేశించి ఏకంగా హుండీనే ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆలయాని శు భ్రపరచడానికి వచ్చిన పని మనిషి.. గుడి లోపలకి వెళ్లి చూడగా ఆలయంలో హుండీ కనిపించలేదు. దీంతో పూజారికి, ఆలయ నిర్వాహకులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న గద్వాల సీఐ భీంకుమార్, పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీస్ సిబ్బంది, ఆలయ నిర్వాహకులు చుట్టు పక్కల వెతికారు. ఈ క్రమంలోనే సమీపంలోని ఓ రైస్ మిల్లు వెనుకాల గల చెత్త కుప్పలో హుండీ పడేసి ఉండటాన్ని వారు గమనించారు. హుండీ తాళాలు పగులగొట్టిన దొంగలు అందులోని డబ్బును తీసుకొని హుండీని మాత్రం అక్కడి పడేసినట్లు వారు గుర్తించారు. హుండీలో దాదాపు లక్ష రూపాయల వరకు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించగా డాగ్ స్క్వాడ్ తో చుట్టూ పరీక్షించారు. దొంగలను పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని గద్వాల పోలీసులు తెలిపారు.






# ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవ వేడుక

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(ప్రభాత ఉదయం)ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ శశికళ మాట్లాడుతూ.. ప్రపంచ జనాభా దినోత్సవం అనేది ప్రతి సంవత్సరం జులై 11న నిర్వహిస్తారన్నారు. ఇది ప్రపంచ జనాభా సమస్యలపై అవగాహన పెంచడానికి ప్రయత్నిస్తుంది అని వివరించారు. జనాభా తగ్గించడానికి సంబంధించిన నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్య అధికారులు ఆరోగ్యశాఖ సిబ్బందికి , తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు, మరియు శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి జనాభా తగ్గించడానికి గల మార్గాలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. కే. సిద్ధప్ప, వైద్యాధికారులు డాక్టర్ ఇర్షాద్, డాక్టర్ రాజు, డాక్టర్. రమేష్, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, డాక్టర్ రాధిక, మరియు వైద్య సిబ్బంది కె. మధుసూదన్ రెడ్డి, తిరుమలేష్ రెడ్డి, వరలక్ష్మి, నరేంద్రబాబు ,శివన్న, లక్ష్మీదేవి, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు



ఫ్రెషర్స్ డే లో నృత్యాలు చేస్తున్న సీనియర్ ఇంటర్ విద్యార్థులు



విద్యార్థుల నృత్యాలు

బుద్వేల్, జూలై11 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య మాట్లాడుతూ, ఇది మంచి సాంప్రదాయమని అన్నారు. కొత్తగా వచ్చిన విద్యార్థులలో భయం లేకుండా చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అధ్యాపకులు పాటలు, మాటల ద్వారా విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులే వ్యాఖ్యాతలుగా ఉండి కార్యక్రమాన్ని ఉ ద్రుతలూగించారు. అనంతరం విద్యార్థులు నటనలతో, డ్యాన్సుల తో , పాటలతో సందడి చేశారు. కాలేజి రోజులు ఎప్పటికి గుర్తుండేలా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మాన్య , స్వప్న, కిరణ్ కుమార్, యన్ .చంద్రశేఖర్, కృష్ణా రెడ్డి, మురళి, శ్రీజన్య, కరుణాకర్, నవీన్, కిషన్, గోపికృష్ణా రెడ్డి, చంద్రశేఖర్, శశిధర్, నర్సింగ్, కుమార్, పర్వీన్, రఫీ పాల్గొన్నారు.

# తెలంగాణ దర్శన్‌లో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లాను సందర్శించిన ట్రైని కలెక్టర్లు





గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన 2023 బ్యాచ్ కు చెందిన ఐఏయస్ ట్రైనీ కలెక్టర్లు ఉమా హారతి - వికారాబాద్ జిల్లా, అజ్మీర సంకేత్ కుమార్ - నిజామాబాద్, గరిమ నరుల - నారాయణపేట, అభిగ్యాన్ మాల్వియా - ఆదిలాబాద్, అజయ్ యాదవ్ - కరీంనగర్, మృనాల్ శ్రేష్ట - ఖమ్మం, మనోజ్ - సంగారెడ్డి లు గురువారం జోగులాంబ గద్వాల జిల్లాను శిక్షణలో భాగంగా సందర్శించారు. జిల్లాకు చేరుకున్న ట్రేని కలెక్టర్లు ముందుగా జోగులాంబ అమ్మవారి ఆలయాన్ని సందర్శించుకున్నారు. అనంతరం నేరుగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తో కలిసి జిల్లాలో అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో చేనేత కార్మికులను కలిసి చేనేత మగ్గాలు, వస్త్రాల తయారీ విదానాన్ని పరిశీలించారు. బట్టలు తయారీ చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. చేనేత వస్త్రాల దుకాణం సందర్శించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు చేనేత , జోలి శాఖ అధికారి గోవిందయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## చెరువులలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలి

### బస్తీలలో దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

### కాలనీలలో దోమల వ్యాప్తికి వాకింగ్ నిర్వహణ చేపట్టాలి

కూకట్‌పల్లి, జూన్ 26 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువు, ముల్లకత్వ చెరువుల్లో కలుషిత జలాల వల్ల పేరుకు పోయిన గుర్రపుడెక్కతో విపరీతమైన దోమలతో పగలు రాత్రి తేడా లేకుండ వాటి బారిన పడి రోగాల పాలవుతున్న చెరువుల చుట్టు పక్కల ఉన్న 2572 కుటుంబాలు దాదాపు 10 వేలపై చిలుకు జనాభా కలిగిన రెయిన్బో విస్టాస్ రాక్ గార్డెన్, 1290 కుటుంబాలు 4 వేల పైచిలుకు జనాభా, రెయిన్బో విస్టాస్ ఫేస్1 450 కుటుంబాలు దాదాపు 2 వేల జనాభా మరియు చుట్టుపక్కల కాలనీలైన సేవాలాల్ నగర్, రాఘవేంద్రనగర్, కైత్లాపూర్, మైస్టిక్ హిల్స్, సప్దార్ నగర్, ఆంజనేయ నగర్, గాయత్రినగర్ కాలనీల దోమల సమస్య కు మరియు కైత్లాపూర్, సేవాలాల్ నగర్ మధ్య ఉన్న ఇరుకైన రోడ్డు విస్తరణ కు నోచుకోక తద్వార నిత్యం విపరీతమైన ట్రాఫిక్ సమస్య కు పరిష్కారం చూపమని స్థానిక శాసనసభ్యులు మాధవరం కృష్ణరావును కలిసి వినతిపత్రం అందజేసిన రేయిన్బో విస్టాస్ అధ్యక్షులు బండి మధుసూదన రెడ్డి, రామిడి. ప్రమోద్ రెడ్డి, టి.రామ్ కిరణ్, పూసపాటి దీప్తి తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు చంద్రారెడ్డి

కూకట్‌పల్లి, జూలై 11 (ప్రభాత ఉదయం) బస్తిలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తూ ఆదర్శవంతమైన బస్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పాపిరెడ్డి నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రా రెడ్డి అన్నారు. బస్తీలోని నాలాపై విరిగిన బిల్లలతో ఏర్పడిన సమస్యలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెల్లి కొత్త బిళ్ళలను ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా గురువారం సిబ్బంది చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. బస్తీలో నెలకొన్న ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దా నని ఈ సందర్భంగా చంద్ర రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తాటి కిరణ్. కనక రెడ్డి , థాకూరి తిరుపతిరెడ్డి. ఆంజనేయులు జిహెచ్ఎంసి. సిబ్బంది . తదితరులు పాల్గొన్నారు.



## అక్రమనకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

### బాలానగర్ ఎమ్మార్వోకు ఆదేశాలు జారీ చేసిన ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, జూలై 11 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధిలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, అధికారులతో కలసి డివిజన్ లోని జింకలవాడ, ప్రభాకర్ రెడ్డి నగర్ బస్తీ సరిహద్దులో ఉన్న ప్రభుత్వ భూమిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రభాకర్ రెడ్డి నగర్, జింకలవాడ సరిహద్దులో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురౌతుందని, ఇట్టి భూమిని సర్వే చేయించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ ప్రభుత్వ భూమి నందు బౌండరీలు పెట్టాల్సిందిగా ఎమ్మార్వో, ఆర్ ఐ కి ఆదేశించారు.



## కూకట్‌పల్లి సుమిత్ర నగర్‌లో ఉమెన్స్, చిల్డ్రన్స్ అంకుర హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎంపీ ఈటెల రాజేందర్

కూకట్‌పల్లి, జూలై 11 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి సుమిత్ర నగర్ మైన్ రోడ్ వద్ద నూతనంగా నిర్మించిన అంకుర ఉమెన్స్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి హాస్పటల్ ను ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈటెల రాజేందర్ కు హాస్పిటల్స్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆధునిక వైద్య పరికరాలతో నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో ప్రజలకు అందే విధంగా హాస్పిటల్ యాజమాన్యం సేవ చేస్తున్నందుకు వారిని ఈటల రాజేందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి అసెంబ్లీ ఇన్చార్జ్ మాధవరం కాంతారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర రావు, మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి, కెపిహెచ్బి కంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వినోద్ గౌడ్, రమేష్, అనంత నాగరాజు, నర్సింగ్ మరియు కూకట్ పల్లి బీజేపీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

### వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

కూకట్‌పల్లి, జూలై 11 (ప్రభాత ఉదయం) పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరైమొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవం కార్యక్రమంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలని సూచించారు. భావితరాలకు మనమిచ్చే ఆస్తి స్వచ్ఛమైన పర్యావరణమే అని అన్నారు. వనమహోత్సవంలో నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యతను అధికారులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మారెడ్డి, అనిల్ రెడ్డి, శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, భాస్కర్ రెడ్డి, నాగేషగౌడ్, పోశెట్టిగౌడ్, కాజామియా, రాజుగౌడ్, ఉమేష్, రాజ్యలక్ష్మి, మధులత, అరుణ, పుట్టం దేవి, సౌందర్య, లక్ష్మీ, సరిత, జిహెచ్ఎంసి అధికారులు యు బి డి సూపర్వైజర్ నాగ రాణి, మల్లేష్, సుధాకర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి

### ఎమ్మెల్యే జిఎంఆర్

మూసాపేట్, జూలై11(ప్రభాత ఉదయం): మూసాపేట్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో వన మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం రైతు వేదిక వద్ద పదవి విరమణ సందర్భంగా ప్రజా ప్రతినిధులకు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని ప్రజాప్రతినిధులను సన్మానించి, తదనంతరం వేముల స్టేజ్ వద్ద మహిళా సంఘాలకు సంబంధించిన ఆదర్శ భవనాన్ని ఎమ్మెల్యే జియంఆర్ పరిశీలించారు.




## నేడు అప్పారెడ్డి గూడెం మల్లయ్య 13వ వర్ధంతి

బుద్వేల్, జూలై11(ప్రభాత ఉదయం):ఈనెల 12న రాజేంద్రనగర్ నివాసులు అప్పారెడ్డి గూడెం మల్లయ్య 13వ వర్ధంతి నిర్వాహణకు కుటుంబ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. షాద్ నగర్ సమీపంలోని నందిగామ మండలం అప్పారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మల్లయ్య బ్రతుకుతెరువు కోసం నగరానికి వచ్చి రాజేంద్రనగర్ లో నివాసం ఉండేవారు. రాజేంద్రనగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐ ఐ ఓ ఆర్) లో మల్లయ్య ఉద్యోగం చేసి పదవి విరమణ పొందారు. ఆయనకు భార్య రత్నమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. 2011 సంవత్సరంలో స్వగ్రామమైన అప్పారెడ్డిగూడెం కు వెళ్లిన ఆయన గుండెపోటుతో మరణించారు.



అప్పారెడ్డి గూడెం మల్లయ్య

## పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(నమస్తే ఉదయం) రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఎనిమిది వేల కోట్ల స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర కమిటీ మేరకు గద్వాలలోని వైయస్సార్ చౌరస్తా ముందు రాస్తారోకో నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఎనిమిదివేల కోట్ల స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులను వేధించడం సరైనది కాదన్నారు. స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే ఆపివేస్తున్నారని ప్రైవేట్ విద్యా సంస్థల యజమానులు స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్ ను సాకుగా చూపి విద్యార్థులకు సంబంధించిన ధ్రువ పత్రాలు అందజేయకుండా వేధిస్తున్నారని విమర్శించారు. విద్యాశాఖకు ప్రత్యేకమైన మంత్రి లేకపోవడం వల్ల విద్యా రంగ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లడం లేదని




తక్షణమే విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తిరుమలేష్, వి శివ, టి పవన్ కుమార్, చరణ్, ఎన్ గణేష్, చంద్రకాంత్, జాన్ శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.